
సాక్షి
నంద్యాల

సోమవారం। 1। ఏప్రిల్। 2024



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఆదోనికి చెందిన గుగ్గిల నానమ్మ రూ.1,00,116 విరాళాన్ని ఆలయ ఏఈఓ ఫనిదర ప్రసాద్‌కు అందజేశారు.



వాహనాల తనిఖీ

రుద్రవరం: ఎన్నికల నేపథ్యంలో శిరివెళ్ల సీఐ చంద్రబాబు, రుద్రవరం ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక బలగాలతో రుద్రవరం–ఆళ్లగడ్డ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు.

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:48
ఆదోని	సా॥ 6:38	ఉ॥ 4:51
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:45
ఆత్మకూరు	సా॥ 6:33	ఉ॥ 4:46
బనగానపల్లె	సా॥ 6:36	ఉ॥ 4:46

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :

బహు దైవారాధనను అల్లాహ్ తీవ్రంగా పరిగణిస్తారు. ఇలాంటి మహా పాపము నుంచి రక్షించమని అల్లాహ్‌ను వేడుకోండి.

– పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా సీహెచ్ జయమ్మ



నంద్యాల టౌన్: నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సీహెచ్ జయమ్మను నియమిస్తూ డీఎంఈ డాక్టర్ డీవీఎల్ నరసింహ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకు ముందు ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత పదవీ విరమణ చేయటంతో కళాశాల అనాటమీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సీహెచ్ జయమ్మను కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశానికి గడువు పొడిగింపు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని ఆదర్శ పాఠశాలలో వచ్చే విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల దరఖాస్తుకు ఏప్రిల్ 6వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మార్చి 3వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రారంభమై 31వ తేదీ వరకు గడువు ఉండగా విద్యార్థుల సౌకర్యార్థం విద్యా శాఖ గడువు పొడిగించిందన్నారు. ప్రవేశ పరీక్షను 5వ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో రాయవచ్చన్నారు. www.csc.ap.gov.in/apms.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని 19 ఏపీ మోడల్ స్కూల్ (ఏపీఎంఎస్)లో 2024–25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైందని డీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. మే 22వ తేదీలోపు https://apms.apcfss.in, www.csc.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పదవ తరగతి మార్కుల మెరిట్, రిజర్వేషన్ నిబంధనల మేరకు సీట్లు కేటాయిస్తారన్నారు.

కార్డుదారులకు 3 కేజీల జొన్నల పంపిణీ

నంద్యాల(అర్బన్): ఏప్రిల్ నెలకు సంబంధించి ప్రతికార్డు దారుడికి బియ్యం బదులు 3 కిలోల జొన్నలు ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే వచ్చి పంపిణీ చేస్తారని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రటకనలో తెలిపారు. జిల్లాలోని కార్డుదారులందరికీ ఉచితంగా బియ్యం, సబ్సిడీ ధరలపై చక్కెర, గోధుమపిండి పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్చిలో 2,89,996 మంది కార్డుదారులకు 3కిలోల చొప్పున 767.790 మెట్రిక్ టన్నుల జొన్నలను పంపిణీ చేశామన్నారు. అదే తరహాలో ఏప్రిల్ మాసంలో కూడా ఎండీయూ వాహనాల ద్వారా కార్డుల దారులందరికీ ఉచితంగా 3 కేజీలు జొన్నలతో పాటు రూ.11కే కేజీ రాగిపిండి పంపిణీ చేపడుతున్నామన్నారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి పురుషుల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టును ఆ క్రీడా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆదివారం ప్రకటించారు. ఎంపికయిన పురుషుల జట్టులో భాస్కర్, సాధిక్, నదీమ్, సురేష్, వెంకటేష్, అక్షయ్, మాబు వలీ, తేజ, ధర్మారావు, సుమంత్ రెడ్డి, చిన్ని బాబు, గణేష్, శివరామ కృష్ణ, సతీష్, వీరాంజనేయులు ఉన్నారు. బిహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని ఆయన పిలుపు నిచ్చారు.

కుట్ర కనిపింఛన్

టీడీపీ కుట్ర బయటపడింది..

అవ్వాతాతలు, దివ్యాంగులకు మళ్లీ కష్టాలు మొదలు కానున్నాయి.. ఇంటి వద్దనే పింఛన్ అందుకోవాల్సిన వారు గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లాల్సిందే! వలంటీర్ వ్యవస్థతో వైఎస్సార్‌సీపీకి మంచి పేరొస్తుందని తెలుగుదేశం పార్టీ కుయుక్తులకు పాల్పడింది.. తన అనుబంధ సంస్థ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. తాము అధికారంలోకి వచ్చినా వలంటీర్లు ఉంటారని టీడీపీ అధినేత చంద్రబాబు ఒక వైపు చెబుతూనే మరో వైపు కుతంత్రాలకు పాల్పడటంపై పింఛన్‌దారులు మండిపడుతున్నారు.

- వలంటీర్ వ్యవస్థ రద్దుకు టీడీపీ కుయుక్తులు
- వైఎస్సార్‌సీపీకి మంచి పేరొస్తుందనే ఫిర్యాదులు
- పింఛన్ల పంపిణీకి దూరమైన వలంటీర్లు
- సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవాల్సిందే
- పింఛన్‌దారుల్లో 10 శాతం మంది నడువలేని పరిస్థితి
- వేలాది మందిని ఎత్తుకు రావాల్సిందే!
- టీడీపీ కుతంత్రాలపై మండిపడుతున్న వృద్ధులు, దివ్యాంగులు



కర్నూలు(అగ్రికల్చర్)/నంద్యాల(న్యూటౌన్): ఇంటి వద్దనే నిశ్చింతగా పింఛన్ తీసుకుంటున్న అవ్వాతాతలు, దివ్యాంగులు టీడీపీ కుట్రలతో నేడు గడపదాటాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 16 రకాల పింఛన్లు ఇస్తోంది. ఉమ్మడి జిల్లాలో 4.73 లక్షల మంది వివిధ కేటగిరీ పింఛన్‌లు తీసుకుంటున్నారు. వీరిలో 70 శాతం మంది అవ్వాతాతలు, దివ్యాంగులు, వివిధ వ్యాధులతో బాధపడేవారు ఉన్నారు. వీరిలో 10 శాతం మంది మంచానికే పరిమితం అయ్యారు. డయాలసిస్, కిడ్నీ రోగులు... ఇలా వేలాది మంది అడుగుతీసి అడుగు వేయలేరు. ఇటువంటి వారందరూ ఏప్రిల్ నుంచి జూన్ వరకు గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి పింఛన్లు అందుకోవాల్సిందే. సచివాలయాలకు వచ్చి పింఛన్లు పొందాలంటే వీరందరూ నరకం చూడాల్సిందే! వేలాది మందిని సచివాలయాలకు ఎత్తుకొని రావాల్సి ఉంది. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేయొద్దంటూ తెలుగుదేశం పార్టీ తన అనుబంధ సంస్థ అయిన సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ దుస్థితి నెలకొంది. టీడీపీ హయాంలో పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా ఉండేది. లబ్ధిదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ కష్టాలను తొలగించింది. వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. అధికార పార్టీకి మంచి పేరొస్తొందనే టీడీపీ కుట్రపన్ని వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరం చేశారు.



ఇంటిదగ్గరే పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీరు(ఫైల్)

అనుకున్నట్టే చేశారు..

వలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుండటంతో టీడీపీకి తీవ్ర ఇబ్బందిగా మారింది. ఏదో విధంగా వలంటీర్ వ్యవస్థను దెబ్బతీయడానికి కొన్నేళ్లుగా ఆ పార్టీ నేతలు చేయని ప్రయత్నం లేదు. అనేక రకాల అభాండాలు వేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో వలంటీర్లపై కక్షసాధింపు చర్యకు పాల్పడ్డారు. పింఛన్ల పంపిణీతో పాటు సంక్షేమ పథకాల అమలులో ఎన్నికల కోడ్ ముగిసే వరకు వలంటీర్లను పక్కన పేట్టే విధంగా చేయగలిగారు. ప్రజలతో మమేకమైన వలంటీర్లపై ఇంత దారుణంగా పగపట్టడంపై అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, ఇతర పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ కష్టాలు మొదలు..

టీడీపీ హయాంలో పింఛన్ పొందడంలో అవ్వాతాతలు, దివ్యాంగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పాఠశాల ప్రాంగణాలు, రచ్చబండల దగ్గర పడిగాపులు కాసేవారు. డబ్బులు రాలేదు.. రేపు..మాపు అంటూ తిప్పుకునేవారు. ఎంత మంది అర్హులు ఉన్నా మండలానికి ఇన్నే పింఛన్లు అని కోటా పెట్టేవారు. ఒక్కో గ్రామానికి 10–15 వరకు పింఛన్లు మాత్రమే వచ్చేవి. జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకుంటే లబ్ధిదారులుగా ఎంపిక చేసేవారు. ఇందుకోసం నాలుగైదు నెలల పింఛన్ మొత్తాన్ని లంచంగా ముట్టచెప్పాల్సి వచ్చేది. ప్రతి నెలా ఇచ్చే పింఛన్‌లోనూ రూ.100, 200 కోత పెట్టేవారు. మరణించిన వారిస్థానంలోనే కొత్త పింఛన్ వచ్చేది. వైఎస్సార్‌సీపీ పాలనలో పింఛన్‌దారుల కష్టాలకు ఫుల్‌స్టాప్ పడింది. అర్హతే ప్రామాణికంగా తీసుకొని రాజకీయాలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారు. ప్రతి 50 ఇళ్లకు గ్రామ, వర్డు వలంటీర్లను నియమించి... వారి ద్వారా నేరుగా ఇంటికే పింఛన్ పంపే ఏర్పాటు చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీ పండుగ ఉన్నా.. సెలవైనా... వానొచ్చినా.. ఇంటికే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. దీంతో అవ్వాతాతలు, దివ్యాంగుల కష్టాలు తొలగిపోయాయి. ఆసుపత్రిల్లో చికిత్స పొందుతుంటే అక్కడికే వెళ్లి పింఛన్ అందచేస్తున్నారు. వలంటీర్లు కేవలం సేవాభావంతో నిస్వార్థంగా పనిచేస్తున్నారు. చంద్రబాబు, కుట్రలు, కుతంత్రాలతో అవ్వాతాతలకు మళ్లీ కష్టాలు ప్రారంభం కానున్నాయి.

ఇందుకే కక్ష..

టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజల రక్త మాంసాలను పీల్చివేశాయి. జన్మభూమి కమిటీలకు చంద్రబాబు అపారమైన అధికారాలు ఇచ్చారు. దీనిని అవకాశంగా తీసుకొని జన్మభూమి కమిటీలోని సభ్యులు చెలరేగిపోయాయి. అవినీతి అక్రమాలతో లక్షాధికారులయ్యారు. జన్మభూమి కమిటీల మాదిరి లంచాలు పిండకపోయినప్పటికీ వలంటీర్ల పట్ల అపారమైన ద్వేషం పెరగడానికి వారి వల్ల అన్ని వర్గాల ప్రజలకు మంచి జరుగుతుండటం.. తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తు వస్తుండటమే కారణమని తెలుస్తోంది.

పింఛన్ల పంపిణీ మార్గదర్శకాలు ఇవీ..

గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీకి ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. లబ్ధిదారులు ఏప్రిల్ నెల గ్రామ, వార్డు సచివాలయాలకు వచ్చి వేలిముద్ర వేసి పింఛన్లు పొందాల్సి ఉంది. ఇందుకు సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు సెర్ప్ ఆదివారం సాయంత్రం మార్గదర్శకాలు జారీ చేసింది. వార్డు, గ్రామ సచివాలయాల్లో పింఛన్ల పంపిణీని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారు. ఏప్రిల్ 1వ తేదీ బ్యాంకులకు సెలవు. 2వ తేదీన పింఛన్ల సంబంధించిన మొత్తం ప్రభుత్వం బ్యాంకులకు విడుదల చేస్తుంది. అదే రోజున గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అర్బన్ ప్రాంతాల్లో వార్డు అడ్మిన్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకుల నుంచి నగదు డ్రా చేస్తారు. మూడో నుంచి 5 రోజుల పాటు సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేస్తారు. పింఛన్లు పంపిణీ చేసే సచివాలయ ఉద్యోగులు, ఆర్‌బీకే ఇన్‌చార్జీలందరి దగ్గర ఎంపీడీవోలు/ మున్సిపల్ కమిషనర్లు జారీ చేసిన ధ్రువపత్రాలు ఉంటాయి.

టీడీపీ హయాంలో అన్నీ కష్టాలే



మోకాళ్ల నొప్పులతో ఎక్కడికి తిరగలేని పరిస్థితిలో ఉన్నా. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుణ్యాన ఇంటి వద్దనే పింఛన్ తీసుకుంటున్నా. ఎన్నికల సమయంలో వలంటీర్లను విధుల నుంచి పక్కనబెట్టడం ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడికో వెళ్లి పింఛన్ తీసుకోవాలంటే ఎన్ని ఇబ్బందులో టీడీపీ హయాంలో చూశాను. మళ్లీ వలంటీర్ల ద్వారానే పింఛన్ సొమ్ము ఇంటి వద్దకు వచ్చి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– రత్నమ్మ, మిట్నాల గ్రామం

ఓటుతో బుద్ధి చెబుతాం



టీడీపీ హయాంలో పింఛన్ వచ్చే వరకు ప్రతి రోజూ కన్నీళ్లు వచ్చేవి. ఎప్పుడిస్తారో తెలిసేది కాదు. ప్రతి రోజూ పంచాయతీ కార్యాలయం దగ్గర పడిగాపులు కాయాల్సి వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మా కష్టాలు తొలగిపోయాయి. వలంటీర్లు ప్రతి నెలా 1వ తేదీనే మా ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. ఇప్పుడు మళ్లీ సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకునే పరిస్థితులు ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. టీడీపీ నేతల కుట్రలు, కుతంత్రాలకు ఓటుతో బుద్ధి చెబుతాం.

– రమావత్ నాగమ్మ, మీటీతాండ, తుగ్గలి మండలం

మళ్లీ ఎదురు చూపులే



టీడీపీ హయాంలో పింఛన్ పొందాలంటే నానా యాతన పడేవాళ్లం. అలాంటి పరిస్థితి లేకుండా వలంటీర్లు ప్రతి నెలా ఠంఛన్‌గా 1వ తేదీనే ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఆ డబ్బులు ఆసుపత్రికి, సొంత ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడేవి. టీడీపీ కుట్రలు పన్ని వలంటీర్లను పింఛన్ల పంపిణీ విధుల నుంచి తప్పించింది. మళ్లీ పింఛన్ కోసం ఎదురు చూడాల్సి వస్తుందేమో!

– మాబున్నిసా, గడివేముల

ఇబ్బందులు తప్పవు



వలంటీర్లు ఉంటే ఇంటికి వచ్చి మా అమ్మాయి తన్వికకు పింఛన్ సొమ్ము ఇచ్చి వెళ్లేవారు. వికలాంగురాలైన చిన్నారిని తీసుకొని సచివాలయానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఏ సమయానికి సి బ్బంది పింఛన్ ఇస్తారో తెలియని పరిస్థితి. వలంటీర్ వ్యవస్థ లేకపోతే దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సిందే.

– చిన్నారి తన్వికతో తల్లి, నూనెపల్లె

వెలుగోడు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

జిల్లాలో ఈస్టర్ వేడుకలను ఆదివారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. వీధుల్లో ప్రదర్శనలు చేశారు. పండుగ ప్రాముఖ్యతను మతపెద్దలు వివరించారు. పాపులను రక్షించడం గుడ్‌ఫ్రైడే సందేశమైతే, సత్యాన్ని అంతం చేయాలన్న ప్రతిసారీ ఏదో రూపంలో జన్మిస్తూనే ఉంటుందన్నది ఈస్టర్ నేర్పిన పాఠమని పేర్కొన్నారు. యేసు క్రీస్తు బోధనలను విశ్వసించి సన్మార్గంలో నడవాలని సూచించారు. బైబిల్ వాక్యాలను పఠించారు.

– నంద్యాల(న్యూటౌన్)

నేటి నుంచి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో సలహా మండలి సమావేశాలు



డాక్టర్ సరళమ్మ, ఆర్‌ఏఆర్‌ఎస్ సహసంచాలకురాలు, నంద్యాల

నంద్యాల(సెంట్రల్): నంద్యాలలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు ప్రాంతీయ పరిశోధనా విస్తరణ సలహా మండలి (జెడ్ఆర్ఈఏఎస్) సమావేశాలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకురాలు డాక్టర్ సరళమ్మ ఆదివారం తెలిపారు. నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ పరిధిలోని నాలుగు జిల్లాల (కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి)ల వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి ప్రస్తుత పరిస్థితులు, గతేడాది క్షేత్ర స్థాయిలో గమనించిన అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం నంద్యాల, కర్నూలు జిల్లాల పరిధిలో 6 పంటలపైన, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో మెట్ట వ్యవసాయంపై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశాలకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ ప్రశాంతి చైర్మన్‌గా వ్యవహరిస్తారని, విస్తరణ విభాగం నుంచి డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ హాజరవుతారని తెలిపారు. సమావేశాల్లో విశ్వవిద్యాలయం సభ్యులుగా కేవీకే, డాట్, ఆర్ఏఆర్ఎస్ నుంచి శాస్త్రవేత్తలను ఎంపిక చేశామన్నారు. వీరితో పాటు వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, ప్రగతిశీల రైతులు గత సంవత్సరం బెట్ట పరిస్థితులు, నూతన సాంకేతిక పద్ధతులు, స్వల్పకాలిక రకాలు, కొత్త వంగడాలపై తమ అనుభవాలు పంచుకుంటారన్నారు. పరిశోధనా స్థానం తరుపున పంపిణీ చేసిన మినీకిట్స్ ఫలితాలపై శాస్త్రవేత్తలు వివరిస్తారన్నారు. దీనికి అనుగుణంగా వచ్చే సీజన్‌కు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ఈ నెల 1వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో సమావేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఉగాది ఏర్పాట్లపై దృష్టి సారించండి

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలు సమీపిస్తుండటంతో దేవస్థాన అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది క్షేత్ర పరిధిలో ఏర్పాట్లపై దృష్టి సారించాలని ఈఓ పెద్దిరాజు సూచించారు. ఆదివారం ఆయన ఉగాది మహోత్సవాల నేపథ్యంలో క్షేత్రంలో చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. యాంఫీథియేటర్, మల్లమ్మ కన్నీరు, పలు ఉద్యానవనాలు, పార్కింగ్ ప్రదేశాలు, రింగ్‌రోడ్డు మొదలైన వాటిని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అన్ని విభాగాల అధిపతులు, పర్యవేక్షకులు ఎప్పటికప్పుడు తమ విభాగంలో సిబ్బందిని సమన్వయపరుస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆరుబయలు ప్రదేశాలలో భక్తులు సేదతీరేందుకు ఇంకొన్ని చోట్ల కూడా చలువ పందిర్లు వేయాలని ఆదేశించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల కంటే మరిన్ని అదనపు ప్రదేశాలలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. చలువ పందిర్ల వద్ద ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతరం మంచినీటి సరఫరా, లైటింగ్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. క్షేత్ర పరిధిలో పలుచోట్ల అన్నదానం చేస్తున్న స్వచ్ఛందసేవా సంస్థలకు, దేవస్థానం తరుపున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. క్షేత్ర పరిధిలో ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలను తొలగిస్తూ డంప్ యార్డ్‌కు తరలించాలని సూచించారు. శౌచాలయాల శుభ్రత పట్ల అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. యజ్ఞవాటిక వద్ద పార్కింగ్ ప్రదేశాలలో ఆయా బస్సులు నిలిపేందుకు రీజియన్ల మాదిరిగా, డివిజన్ల వారీగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈఓ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రామకృష్ణ, డీఈఈ సుబ్బారెడ్డి, చంద్రశేఖరశాస్త్రి, ఏఈలు రాజేశ్వరరావు, రంగప్రసాద్, భవన్, ప్రణయ్, మేఘనాథ్, ఉద్యానవన అధికారి లోకేష్ తదితరులు ఉన్నారు.



క్షేత్రపరిధిలో ఉగాది ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవస్థాన ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో శ్రీగిరి చేరుకున్నారు. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి బారులుదీరారు. ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. కన్నడ భక్తుల సౌకర్యార్థం ప్రతి 2 గంటలకు ఒకసారి మల్లికార్జున స్వామివారి స్పర్శదర్శనానికి అనుమతించారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి. ఆలయ ప్రాంగణం భక్తుల శివనామస్మరణతో మారుమోగింది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు

కోడ్ ఉల్లంఘనలపై కొరడా

- 15 రోజుల్లో రూ. 1.74 కోట్లు సీజ్
- రూ. 75 లక్షల విలువైన మద్యం, ఇతర వస్తువులు స్వాధీనం
- జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు



జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు

నంద్యాల: ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఉల్లంఘనల కింద దాదాపు రూ. 2.49 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీన కోడ్ అమల్లోకి రావడంతో ఇప్పటి వరకు 15 రోజుల్లో రూ.1.74 కోట్ల నగదు, రూ.59 లక్షల విలువైన మద్యం, రూ.16 లక్షల విలువైన వస్తువులు సీజ్ చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు పరుస్తున్నామని, ఎంసీసీ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు ఎలాంటి కార్యక్రమాలకైనా ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు. సువిధా యాప్ ద్వారా అనుమతులు మంజూరు చేయడం, సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించి 100 నిమిషాల్లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ ద్వారా సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ పటిష్టంగా చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ఎన్నికల ఉల్లంఘనలను ఉపేక్షించే ప్రసక్తి లేదని, నిబంధనలను పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు.

ఎన్నికల వేళ పాటించాల్సిన జాగ్రత్తలు

- జిల్లా ప్రజలందరూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నన్ని రోజులు కింది సూచనలు పాటిస్తూ జాగ్రతగా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు సూచించారు.
- రూ.50వేలు అంతకు మించి నగదు తీసుకొని వెళ్లే వారు సంబంధిత రసీదు, ఆధారాలు వెంట తీసుకొని వెళ్లాలి.
- విలువైన వస్తువులు, వ్యాపార పరమైన వస్తువులు, సరుకులు తీసుకొని వెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన జీఎస్‌టీ రసీదు తప్పకుండా తీసుకెళ్లాలి.
- ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు జప్తు చేసిన నగదు, విలువైన వస్తువులు తమకు చెందినదేనని ధ్రువీకరిస్తూ సంబంధిత అన్ని ఆధారాలతో నిరూపించగలిగితే కింది విధంగా వాటిని తిరిగి మరలా పొందవచ్చు.
- రూ.10 లక్షల లోపు నగదు కానీ విలువైన వస్తువులు కానీ జిల్లా ఫిర్యాదు కమిటీ ద్వారా తిరిగి పొందవచ్చు.
- రూ.10 లక్షల పైన విలువైన నగదు కానీ, వస్తువులు కానీ ఆదాయపు పన్ను నోడల్ అధికారి ద్వారా తిరిగి పొందవచ్చు.

క్లుప్తంగా

పశువులకు చలివేంద్రాలు



కర్నూలు(అగ్రికల్చర్): మొదటిసారిగా పశువులకు జిల్లాలో చలివేంద్రాలు ఏర్పాటయ్యాయి. స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ వీటిని ఏర్పాటు చేసింది. కర్నూలు నగరంలోని సిల్వర్‌జుబ్లీ కాలేజీ పరిసరాల్లో ఒకటి, ఎమ్మిగనూరులో మరొకటి చలి వేంద్రాలు ఏర్పాటు చేసింది. చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు నిరంతరం వాటికి నీళ్లను సరఫరా చేస్తోంది. వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఇప్పటికే ఎండల తీవ్రత 43.50 డిగ్రీలకు చేరింది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో ఆవులు, ఇతర పశువులు, పక్షులు దాహార్తిని తీర్చుకుంటున్నాయి.

ఉచిత వైద్య శిబిరం



వైద్య బృందంతో ముచ్చటిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి మఠం , ఐడీ ఏఆర్‌సీ ఇంటర్నేషనల్ సంస్థ సమన్వయంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆదివారం స్థానిక విజయీంద్రీ ఆరోగ్య శాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ శంకర్ నేతృత్వంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె, కిడ్నీ, మెదడు వ్యాధులకు సంబదించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే అన్నపూర్ణ భోజనశాల ఎదుట వేసవిని పురస్కరించుకుని ప్రత్యేక షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. షెల్టర్‌ను, ఉచిత వైద్య శిబిరాన్ని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ప్రారంభించారు.

వ్యక్తిపై కత్తితో దాడి

గోస్పాడు: జూలేపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై కత్తితో దాడి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోస్పాడుకు చెందిన మద్దిలేటి, జూలేపల్లెకు చెందిన సుదర్శన్ ఈస్టర్ పండుగ సందర్భంగా గోస్పాడులో మద్యం తాగారు. వారి మధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో మద్దిలేటి తన అన్న అయిన వెంకటేశ్వర్లుకు గొడవ విషయాన్ని చెప్పడంతో తిరిగి ఇరువురు జూలేపల్లెకు వెళ్లి సుదర్శన్‌పై వెంకటేశ్వర్లు కత్తితో దాడి చేశాడు. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు కర్నూలుకు రెఫర్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

తుగ్గలి: మండల పరిధిలోని పగిడిరాయిలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జొన్నగిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు..ఆదోనికి చెందిన మాదిగ సురేష్(24)కు పగిడిరాయికి చెందిన అంజలితో ఏడు నెలల క్రితం వివాహమైంది. కొద్ది రోజులుగా వీరి మధ్య విభేదాలతో తలెత్తాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది సురేష్ శనివారం భార్య ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి మారెన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు.

నేడు పీఓలు, ఏపీఓలకు శిక్షణ

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు, ఆదోని, కర్నూలు, పాణ్యం నియోజకవర్గాలకు చెందిన పీఓలు, ఏపీఓలకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నగరంలోని ఎమ్మార్సీ కన్వెన్షన్‌లో ఉదయం 9 నుంచి 1 గంట వరకు కోడుమూరు, ఆదోని పీఓలు, ఏపీఓలకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటలకు కర్నూలు, పాణ్యం అధికారులకు శిక్షణ ఇస్తారు.

లక్ష్యానికి మించి.. ఉపాధి కల్పించి!

- 2023-24 సంవత్సరానికి జిల్లాకు 70 లక్షల పనిదినాలు కేటాయింపు
- గత నెలాఖరుకే ముగిసిన పనిదినాలు
- మార్చి నెలకు అదనంగా ఆరు లక్షల పనిదినాల నిర్దేశం
- గడువులోగా అదనపు పనిదినాలు పూర్తి
- కూలీలకు చేతినిండా పని
- 2024 ఆర్థిక సంవత్సరం నుంచి రూ. 300 వేతనం



కోవెలకుంట్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కోవెలకుంట్ల: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథక పనులు నిర్దేశించిన లక్ష్యాన్ని దాటిపోయాయి. గ్రామాల్లో అడిగిన వారందరికి పనులు కల్పించడంతో కూలీలకు చేతినిండి పని లభించింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులతో ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన పనిదినాలకు తోడు రాష్ట్ర ప్రభుత్వం అదనపు పనిదినాలు కల్పించింది. ఆ పనిదివాలు ఆర్థిక సంవత్సరం ముగిసేలోపే పూర్తి అయ్యాయి. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 4.38 లక్షల జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 8.70 లక్షల మంది కూలీలు ఉన్నారు. 1.56 లక్షల కుటుంబాల్లోని 2.71 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ఆయా మండలాల్లో 70 లక్షల పని దినాలు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం రూ. 337 కోట్ల లేబర్ (కూలీలవేతనం, మెటీరియల్ కలిపి) బడ్జెట్ కేటాయించారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలని ఆయా మండలాల పరిధిలో వ్యవసాయ పొలాలకు రహదారులు, కేసీ, ఎస్సార్బీసీ, కుంటలు, చెరువులు, బావుల్లో పూడికతీత, కొత్తగా పంట కాల్వలు, కొండ ప్రాంతాల్లో నీరు నిల్వ చేరే పనులు, ముళ్ల పొదల తొలగింపు, ఉద్యానవన శాఖ పరిధిలో మామిడి, నిమ్మ, సపోట, జామ, తదితర పండ్ల తోటల పెంపకం, తదితర 30 నుంచి 40 రకాల పనులు చేశారు. రైతుల అవసరాలకనుగుణంగా ఆయా పనులకు ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేశారు.

6 లక్షల అదనపు పనిదినాలు..

ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి ఆర్థిక సంవత్సరం ముగియాల్సి ఉంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ పనులు తక్కువ కావడంతో ఫిబ్రవరి నెలాఖరు నాటికే 70 లక్షల పనిదినాలు పూర్తి అయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో నెల రోజులు గడువు ఉండగానే పనుల కొరత ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లాకు ఆరు లక్షల అదనపు పనిదినాలను కేటాయించింది. ఈ ఏడాది ముందు పనిదినాలను కలుపుకుని మొత్తం 76 లక్షల పనిదినాలు కేటాయించారు. మార్చి 30వ తేదీ నాటికి 76, 36,744 పని దినాలు పూర్తి కావడంతో లక్ష్యం వందశాతం మించి పోయింది. జిల్లాలో బేతంచెర్ల మండలంలో అత్యధికంగా 4.07 లక్షల పనిదినాలు, బనగానపల్లె మండలంలో 3.58 లక్షలు, పాములపాడు మండలంలో 3.43 లక్షలు, బండి ఆత్మకూరు మండలంలో 3.24 లక్షలు, కొత్తపల్లె మండలంలో 3.15 లక్షలు, డోన్ మండలంలో 2.96 లక్షలు, రుద్రవరం మండలంలో 2.93 లక్షలు, పాణ్యం మండలంలో 2.88 లక్షలు, గోస్పాడు మండలంలో 2.70 లక్షలు, చాగలమర్రి మండలంలో 2.69 లక్షలు, ఆళ్లగడ్డ మండలంలో 2.67 లక్షలు, అవుకు మండలంలో 2.66 లక్షల పని దినాలు కల్పించారు. మిగిలిన మండలాల్లో కూలీలు 1.50 లక్షల నుంచి 2.50 లక్షల పనిదినాలు పూర్తి చేసుకున్నారు.

జిల్లాలో క్లస్టర్ల వారీగా కల్పించిన పనిదినాలు

క్లస్టర్	పనిదినాల లక్ష్యం	కల్పించిన పని దినాలు
కోవెలకుంట్ల	18.57 లక్షలు	17.32 లక్షలు
ఆత్మకూరు	18.90 లక్షలు	18.19 లక్షలు
డోన్	18.63 లక్షలు	19.86 లక్షలు
నంద్యాల	19.88 లక్షలు	20.92 లక్షలు

15 వేల కుటుంబాలు.. వంద పని దినాలు..

జిల్లాలో ఈ ఏడాది 15 వేల కుటుంబాలు వంద పనిదాలు పూర్తి చేసుకున్నాయి. జిల్లాలోని ప్యాపిలి మండలంలో అత్యధికంగా 984 కుటుంబాలు, బనగానపల్లె మండలంలో 815, పాణ్యం మండలంలో 758, బండిఆత్మకూరు మండలంలో 725, ఆళ్లగడ్డ మండలంలో 673, మిడుతూరు మండలంలో 664, జూపాడుబంగ్లా మండలంలో 605, గడివేముల మండలంలో 604 కుటుంబాలు వంద పనిదినాలు పూర్తి చేసుకున్నాయి. కూలీలకు రోజుకు రూ.272 గరిష్ట వేతనం కాగా ఆయా మండలాల్లో రోజుకు రూ. 250 సగటు వేతనం అందింది. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ఆయా మండలాల్లో 4 వేల కుటుంబాలకు మాత్రమే వంద పనిదినాలు కల్పించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం కూలీలకు గరిష్టవేతం రూ.272 కేటాయించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి ఆ వేతనాన్ని రూ. 28 పెంచి రూ. 300 చేస్తూ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు గరిష్టంగా రూ. 300 కూలీ వచ్చే అవకాశాలు ఉండటంతో కూలీల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులు, లేబర్‌బడ్జెట్ గుర్తించి జిల్లా అధికారులకు నివేదికలు పంపారు.

ఉపాధిలో అక్రమాలకు చెక్..

ఉపాధి హామీ పథకంలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా అధికారులు పకడ్బందీగా అమలు చేశారు. పనుల గుర్తింపు మొదలుకొని డబ్బులు చెల్లింపు వరకు ప్రత్యేక యాప్‌ల్లో వివరాలు నమోదు చేసేలా విధి విధానాలు రూపొందించారు. అలాగే ఉపాధి పథకంలో ఒకేసారి అన్ని రకాల పనులు చేయకుండా ఈ ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన పనుల్లో 20 పనులు మాత్రమే చేసేలా యాప్‌లో నిబంధన విధించారు. ఈ పనులు కాకుండా మరో పని ఎంచుకుంటే 20 పనుల్లో ఒక పనిని ఆన్‌లైన్‌లో తొలగించి కొత్తగా ఎంపిక చేసిన పనిని నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఉపాధి పథకంలో ఎలాంటి అవకతవకలు, బినామీ మస్టర్లకు తావు లేకుండా హాజరు విధానాన్ని పకడ్బందీ చేశారు. మస్టర్‌లో అటెండెన్స్ వేసిన వెంటనే సెల్‌లో ప్రత్యేక యాప్ ద్వారా పని ప్రదేశంలో కూలీ ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. పని ప్రారంభమయ్యాక నాలుగు గంటల తర్వాత అదే కూలీని మరోసారి ఫోటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ విధానంతో ఉపాధిలో అక్రమాలకు చెక్ పడినట్లు అయింది.

వంద పని దినాలు అయ్యాయి



నాతోపాటు నా భర్త దేవరాజు, కుమారుడు బాలరంగయ్య ముగ్గురం ఉపాధి పనులకు వెళ్తున్నాం. ఈ ఏడాది పంట కాల్వలు, పాలేరు వాగులో పూడికతీత, ఉద్యాన పంటలకు సంబంధించి వివిధ పండ్లమొక్కలు నాటే పనులకు వెళ్లాం. ఆ కుటుంబానికి ఈ ఆర్థిక సంవత్సరం వంద పనిదినాలు కల్పించారు. రోజుకు సగటు వేతనం రూ. 240 నుంచి రూ. 250 వచ్చింది. రాబోయే సంవత్సరంలో ఉపాధి పనులకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాము. **– దేవమ్మ, ఉపాధి కూలీ, లింగాల, కోవెలకుంట్ల మండలం**

సకాలంలో వేతనాలు అందాయి



మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది సకాలంలో వేతనాలు అందాయి. నేను, నా భార్య ఆదిలక్ష్మి ఇద్దరం ఉపాధి పనులకు వెళ్లి వంద పనిదినాలు పూర్తి చేసుకున్నాము. మా గ్రామంలో 120 కుటుంబాలు ఉపాధి పనులకు వెళ్లగా 22 కుటుంబాలు వంద పనిదినాలు పూర్తి చేసుకున్నాం. అధికారులు అడిగిన వెంటనే ఉపాధి పనులు కల్పించారు. **– రాముడు, ఉపాధి కూలీ, గుంజలపాడు, కోవెలకుంట్ల మండలం**

టీడీపీలో 'బొగ్గుల' ముసలం

- ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన 'కోట్ల' వర్గం
- అధిష్టానం ఏకపక్ష నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి
- బొగ్గుల దస్తగిరిని ఓడించేందుకు నిర్ణయం
- రెబల్ అభ్యర్థిగా ఆకెపోగు ప్రభాకర్!



భూపాల్ కాంప్లెక్స్‌లో సమావేశమైన కోడుమూరు నియోజకవర్గ కోట్ల వర్గీయులు

కర్నూలు: టీడీపీలో ముసలం పుట్టింది. కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానం తీసుకున్న ఏకపక్ష నిర్ణయంపై వ్యతిరేకంగా ఉన్న వారంతా ఒక్కటయ్యారు. కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి వర్గంగా ముద్ర పడిన వారంతా మొదటి నుంచి బొగ్గుల దస్తగిరి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ... పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తూ అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆకెపోగు ప్రభాకర్‌కు టికెట్ వస్తుందని అందరు భావించారు. అయితే ఊహించని రీతిలో పార్టీ సభ్యత్వం కూడా లేని బొగ్గుల దస్తగిరిని అధిష్టానం అభ్యర్థిగా ప్రకటించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆకెపోగు ప్రభాకర్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడ్డారు. అయినప్పటికీ పార్టీ అధిష్టానం నుంచి ఆయనకు ఎలాంటి భరోసా లభించలేదు. కోట్ల వర్గానికి ఎలాంటి ప్రాధాన్యత కల్పించక పోవడంతో ఆ వర్గానికి చెందిన నాలుగు మండలాల ముఖ్య నాయకులు కర్నూలులోని భూపాల్ కాంప్లెక్స్‌లో భవిష్యత్ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఆకెపోగు ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి గూడూరు మాజీ జెడ్పీటీసీ, మండల టీడీపీ కన్వీనర్ జూలకల్లు సుధాకర్‌రెడ్డి, కర్నూలు మండల పార్టీ అధ్యక్షులు శంకర్, కోడుమూరు మాజీ సర్పంచ్ సీబీ లత, కోడుమూరు సింగిల్ విండో అధ్యక్షులు మధుసూధన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు హేమాద్రిరెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సుందర్‌రాజు, గుడిపాడు చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పంచలింగాల రాజశేఖర్‌రెడ్డి, కొత్తకోట సర్పంచు శ్రీనివాసులు, ఉల్చాల మాజీ సర్పంచు రాఘవేంద్ర, గూడురు మైనారిటీ సెల్ కన్వీనర్ సలీం, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి వంశీధర్‌రెడ్డి, టీడీపీ బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి విజయకుమార్‌తో పాటు పలువురు క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.

రెబల్ అభ్యర్థిగా ఆకెపోగు ప్రభాకర్?

సమావేశంలో టీడీపీ అధిష్టానం నిర్ణయాన్ని వ్యతిరేకించారు. టీడీపీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి వర్గంగా ముద్రపడిన బొగ్గుల దస్తగిరిని ఎన్నికల్లో ఓడించాలని నిర్ణయం తీసుకున్నారు. అందుకు అనుగుణంగా ఆకెపోగు ప్రభాకర్‌ను రెబల్ అభ్యర్థిగా బరిలో నిలపాలని కొందరు నేతలు చేసిన ప్రతిపాదనకు సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశం విషయం బయటకు పొక్కిన నేపథ్యంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులుగా ఉన్న డాక్టర్ శ్రీనివాసమూర్తి రంగంలోకి దిగారు. తొందరపడి ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని ఫోన్‌లో కోరినట్లు సమాచారం. అయితే మరో రెండు రోజుల్లో కోడుమూరులో సమావేశం నిర్వహించి అందరి అభిప్రాయాలను తీసుకొని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

పార్టీ మారేందుకు సమాలోచనలు..

సమావేశంలో కొందరు ఆకెపోగు ప్రభాకర్‌ను రెబల్ అభ్యర్థిగా పోటీ చేయిద్దామనగా, వద్దొద్దు .. మనమే పార్టీ మారదాం, వైఎస్సార్‌సీపీలోకి వెళ్లి సత్తా చాటుదామని మరి కొందరు నేతలు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ సమావేశానికి కర్నూలు రూరల్, కోడుమూరు, గూడురు, సీ బెళగల్ మండలాలకు చెందిన ముఖ్య నేతలు హాజరై ప్రభాకర్‌కు మద్దతు ప్రకటించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

టైర్ పేలి.. 'కూలి'న బతుకులు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళల దుర్మరణం
- 21 మందికి గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే శ్రీదేవి




మృతి చెందిన ఆదిలక్ష్మి,సంజమ్మ (ఫైల్)



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు వారివి. ఎప్పటి మాదిరిగానే టాటా ఏస్ వాహనంలో ఎక్కి కూలి పనులకు వెళ్లారు. తిరిగి ఇంటికి చేరుకునే సమయంలో వాహనం టైర్ పేలి ఇద్దరు మహిళలు మృత్యువాత పడ్డారు. మరో 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన ఆదివారం మద్దికెర శివారులో చోటుచేసుకుంది. పరో 10 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనే లోపు విషాదం చోటుచేసుకుంది. మద్దికెర గ్రామం నుంచి ప్రతి రోజు చిప్పగిరి మండలంలోని గ్రామాల్లో మిరప పంటను కోయడానికి కూలీలు వెళ్లేవారు. ఆదివారం కూడా టాటా ఏస్ వాహనంలో 25 మంది మహిళా కూలీలు వెళ్లారు. పనులు ముగించుకుని మధ్యాహ్నం తిరిగి వస్తుండగా మద్దికెర గ్రామ శివార్లలో వాహనం టైరు పేలి అదుపుతప్పి కరెంటు స్తంభానికి ఢీ కొట్టింది. ప్రమాదంలో ఆదిలక్ష్మి (55), సంజమ్మ (50) అక్కడిక్కడే మృతి చెందారు. మరో 21 మంది మహిళలు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొంత మంది గుంతకల్లుకు, మరికొంత మందిని కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఆదిలక్ష్మికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు పెళ్లిళ్ల కాగా.. కుమారుడికి వివాహం చేయాల్సిన ఉంది. సంజమ్మకు ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేక కూలి పనులకు వెళ్తూ మృత్యువాత పడటంతో ఆ కుంబాల్లో విషాదం అలుముకుంది.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రమాదం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కర్నూలు నుంచి హుటాహుటిన సంఘటనా స్థలానిక చేరుకొని పరిసరాలను పరిశీలించారు. గుంతకల్లు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు ఉన్నారు.

తల్లిదండ్రులపై కుమారుడి దాడి

- కేసు నమోదు చేసిన పోలీసులు



దోన్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు తిమ్మన్న

కృష్ణగిరి: తల్లిదండ్రులపై కుమారుడు కొడవలితో దాడి చేసిన ఘటన మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గువ్వలకుంట్ల తిమ్మన్న, లక్ష్మీదేవి దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఏడాదిగా తల్లిదండ్రుల నుంచి వేరై కుమారుడు తన భార్యాపిల్లలతో వేరుగా ఉన్నారు. ఉన్న పొలాన్ని ఇరువురు సాగు చేసుకుంటున్నారు. అయితే పొలం వద్ద తల్లిదండ్రులు కట్టెలు ఏరుకుంటుండగా.. తన చెట్టు వద్ద ఎందుకు ఏరుతున్నారని కుమారుడు గొడవపెట్టుకున్నాడు. తండ్రి చేతిలోని కొడవలిని తీసుకుని దాడి చేశాడు. అడ్డుపోయిన తల్లిపై కూడా దాడి చేయగా, చుట్టు పక్కల పొలాల రైతులు గమనించి వెంటనే వారిని 108 ద్వారా డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తండ్రి తిమ్మన్న ఫిర్యాదు మేరకు కుమారుడు లక్ష్మన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

మహానందీశ్వరుడి సేవలో..



జస్టిస్ రవీంద్రబాబుకు జ్ఞాపికను అందిస్తున్న ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి



జస్టిస్ సురేష్‌రెడ్డికి మెమెంటో అందిస్తున్న ఏఈఓ యరమల మధు

మహానంది: ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ రవీంద్రబాబు, జస్టిస్ కంచర్ల సురేష్‌రెడ్డిలు వేర్వేరుగా ఆదివారం మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఓ యరమల మధులు స్వాగతం పలికారు. ఈ మేరకు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో వారికి స్వామి, అమ్మవారి మెమెంటో, ప్రసాదాలు అందించి వేదాశీర్వచనాలు చేయించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

కర్నూలు(సెంట్రల్) : నగరంలోని ఆటోనగర్‌లో ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొని అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. కర్నూలు ట్రాఫిక్ సీఐ గౌతమి తెలిపిన వివరాల మేరకు.. ఆటోనగర్‌లో నివాసం ఉంటున్న అంబాజీరావు (63) ఆదివారం ఉదయం 5.30 గంటలకు వాకింగ్ కోసం ఇంటి నుంచి బయలు దేరాడు. ఉల్చాల రోడ్డులోని శ్రీవరలక్ష్మి ఆటో మొబైల్స్ ఎదుట అతివేగంతో వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్ర రక్తగాయాలతో పడి ఉన్న ఆయనను వీకర్ సెక్షన్ కాలనీలో వలంటీర్‌గా పని చేస్తున్న మధు గుర్తించాడు. వెంటనే క్షతగాత్రుడి అల్లుడు నాగరాజరావుకు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి చేరుకుని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, చికిత్స పొందుతూ రాత్రి 8 గంటల సమయంలో చనిపోయినట్లు వైద్యులు తెలిపినట్లు సీఐ గౌతమి తెలిపింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె ప్రకటించింది.

జగనన్న పాలనలో సంచార జాతుల జీవితాల్లో వెలుగులు



మాట్లాడుతున్న సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్ వీరన్న

నంద్యాల: సంచార జాతుల జీవితాల్లో వెలుగులు నింపిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అని సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్ పెంచ్రె వీరన్న పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శిల్పా స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరన్న మాట్లాడుతూ.. సంచార జాతులలో ఉన్న అనేక జాతులను ఏ ప్రభుత్వం గుర్తించలేదన్నారు. సంకల్ప యాత్ర సందర్భంగా సంచార జాతుల గురించి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సంచార జాతుల అభ్యున్నతికి, సామాజిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో గతంలో ఏ ముఖ్యమంత్రి తమపై ప్రత్యేక దృష్టి సారించలేదన్నారు. కేవలం జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే తమ సమస్యలను పట్టించుకుని పరిష్కరించారన్నారు. జగనన్న మళ్లీ సీఎం చేసేందుకు నంద్యాల జిల్లాలో తమ సామాజిక వర్గాలను కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తానన్నారు. 2014 సంవత్సరంలో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీలకు, సంచార జాతులకు మొండి చేయిచూపించారన్నారు. శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి హయాంలో నంద్యాల ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ఎన్నికల్లో నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలన్నారు.

ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు మృతి




మృతిచెందిన దస్తగిరమ్మ (ఫైల్), శేఖన్‌బీ (ఫైల్)

ఆలూరు రూరల్/ఆదోని అర్బన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దస్తగిరమ్మ (54) ఆదోనిలోని ప్రైవేటు ఆస్పత్రిలో, శేఖన్‌బీ (36) కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ కోలుకోలేక ఆదివారం ఉదయం మృతి చెందారు. హులేబీడు గ్రామానికి చెందిన 40 మంది వ్యవసాయ కూలీలు శనివారం ఉదయం చిప్పగిరి మండలం దేగులహాల్ గ్రామ పొలాల్లో మిరప పంట పనులకు మినీ ట్రక్కులో వెళ్లారు. తిరిగి వస్తుండగా హత్తిబెళగల్ గ్రామ బస్టాండ్ వద్ద ట్రక్కు బోల్తాపడి 19 మందికి గాయాలైన విషయం తెలిసిందే. ఇందులో తీవ్రంగా గాయపడిన మస్తానమ్మ, శేఖమ్మ, దస్తగిరమ్మ మెరుగైన చికిత్సకు ఆదోని, కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. ఇందులో మస్తానమ్మ (54) శనివారం సాయంత్రం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో కోలుకోలేక మృతిచెందింది. ప్రమాదంలో గాయపడిన మరో 16 మంది చికిత్స పొందుతున్నారు.

కుటుంబాన్ని చిదిమేసిన వరుస రోడ్డు ప్రమాదాలు

ప్రమాదంలో మృతి చెందిన శేఖన్‌బీ కుమారుడు దూద్ పీరా (12) ఫిబ్రవరి నెల 4వ తేదిన ఉదయం హులేబీడు సమీపంలో బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా కారుఢీకొన్న ప్రమాదంలో గాయపడి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. కొడుకు మృతిచెందిన రెండు నెలల వ్యవధిలో మరో రోడ్డు ప్రమాదంలో తల్లి శేఖన్‌బీ (36) మృతిచెందింది. వరుస రోడ్డు ప్రమాదాలు తన కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేశాయని మృతురాలి భర్త మోదిన్ సాబ్ కన్నీరుమున్నీరయ్యాడు.

బాధితుల కుటుంబాలను పరామర్శించిన విరూపాక్షి



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న విరూపాక్షి

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ముగ్గురు కూలీలు మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి ఆదివారం హులేబీడు గ్రామానికి వెళ్లి మృతదేహాలకు నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. రోడ్డు ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేశారు.